క్లుప్తంగా

నేడు 'జగనన్న సురక్ష' శిబిరాలు

రాయవరం: మండలంలోని లొల్ల, చెల్లూరు–2 సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరాల్లో 11 రకాల ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. దీనిని గ్రామస్తులు, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లల ఉన్నతికి బాటలు వేయాలి



బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్చుకుంటున్న డీవైఈఓ షాలెంరాజు

మండపేట: విద్యార్థుల ఉన్నతికి అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద తదితర అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపడం ద్వారా వారి ఉజ్వల భవితకు బాటలు వేయాలని డీవైఈఓ పి.షాలెంరాజు కోరారు. స్థానికంగా ఇద్దరు బడి బయట పిల్లలను శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్లలోపు బడిఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. వారికి ఆర్‌టీఈ యాక్ట్ ద్వారా అడ్మిషన్లు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం ఆర్.నాగకుమార్, ఉపాధ్యాయుడు ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వినియోగంపై అవగాహన



తాగునీరు పరీక్ష చేసే విధానాన్ని వివరిస్తున్న నిమ్మకాయల పద్మరాజు

కపిలేశ్వరపురం: తాగునీటి లభ్యత, వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నేలటూరు గ్రామ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం నేలటూరులో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తాగునీటి ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో గ్రామస్తులకు తాగునీటి పరీక్ష చేసే విధానంపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిమ్మకాయల పద్మరాజు ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీ



విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ షాలెమ్‌రాజు

రాయవరం: పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలను రామచంద్రపురం డీవైఈఓ పి.షాలెమ్‌రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న విద్యాపరమైన కార్యక్రమాలను పరిశీలించారు. జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులందరికీ పూర్తి స్థాయిలో అందించారా? లేదా అని ఆరా తీశారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల విద్యా స్థాయి, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేశారా అనే విషయాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులంతా డైరీలు, లెసన్ ప్లాన్లు రాయాలని, సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి



ఆశ్రమానికి ఫ్యాన్లు అందజేస్తున్న కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు

రాయవరం: ఉన్నంతలో పేదల కోసం చేసిన సేవలే ప్రజల్లో హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ అనపర్తి మండల అధికార ప్రతినిధి, రామవరానికి చెందిన వ్యాపారవేత్త నల్లమిల్లి వెంకటరెడ్డి (789 శ్రీను) జన్మదిన వేడుకలు శుక్రవారం లొల్ల గ్రామ మానవతా ఆశ్రమంలో జరిగాయి. ఆశ్రమంలోని విద్యార్థుల సౌకర్యార్థం వెంకటరెడ్డి పద్మావతి దంపతులు రూ.15 వేల విలువైన ఫ్యాన్లను కృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. రామవరం సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, వార్డు సభ్యులు నల్లమిల్లి సంధ్య, కోరాడ నాగదేవి పాల్గొన్నారు.

లోకమంతా పచ్చగానే కనిపిస్తుందా పవన్!



మండపేటలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



టేకిలో మాట్లాడుతున్న తహసీల్దార్ కొమరం సూర్యారావు

- ఎమ్మెల్సీ త్రిమూర్తులు మండిపాటు
- వలంటీర్లు చేసే మంచిని చూడాలని హితవు

మండపేట: పచ్చ కామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్న చందాన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వైఖరి ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ పాలనలో వలంటీర్లు చేస్తున్న మంచిని చూడాలని హితవు పలికారు. మండపేట పట్టణంలో 15, 20 వార్డులకు సంబంధించి సీతారామ కల్యాణ మండపంలో కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ అధ్యక్షతన జగనన్న సురక్ష సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రధాని మోదీ సైతం వారి సేవలను గుర్తించి కొనియాడిన సందర్భాలు ఉన్నాయని గుర్తించుకోవాలన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగడంతో పాటు లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇప్పుడు అన్ని పథకాలూ నేరుగా లబ్ధిదారుల చెంతకే అందుతున్నాయన్నారు. ఇన్ని సేవలు అందిస్తున్నప్పటికీ వలంటీర్లు ఎక్కడా ఒక్క రూపాయి అవినీతికి పాల్పడిన దాఖలాలు లేవన్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఇబ్బంది పడాల్సిన పనిలేకుండా జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని అన్నారు. సంక్షేమ పాలన ద్వారా ప్రజలకు చేరువైన సీఎం జగన్‌ను చూసి ఓర్వలేక టీడీపీ, జనసేనలు కలసి నాటకాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్సీ తోట ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, జంగమ, షేక్ కార్పొరేషన్ల డైరెక్టర్లు మీగడ శ్రీనివాసరావు, షేక్ ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో పేదలకు మేలు

కపిలేశ్వరపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. టేకిలో సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటింటా సర్వే చేసి పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేసే లక్ష్యం విజయవంతం అవుతుందని వారన్నారు. గ్రామంలో 2,046 మందికి చెందిన సాంకేతిక సమస్యలను పరిష్కరించామన్నారు. ఇంకా సాంకేతిక సమస్యలతో ప్రభుత్వ పథకాలు అందని వారుంటే వలంటీర్, సచివాలయ ఉద్యోగులను సంప్రదించాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కుక్కల బాలయ్య, గుండుపల్లి బాబూరావు, గంటి జార్జి, యాండ్రపు రమణ, మేడిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- పట్టణంలో గడప గడపకూ..



రామచంద్రపురంలో మహిళల సమస్యలు వింటున్న మంత్రి వేణు

రామచంద్రపురం: తన పాదయాత్ర ద్వారా పేదవారి కష్టాలను తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనకు నవరత్న పథకాలను తీసుకువచ్చారని ప్రతి కుటుంబానికి వాటిని చేరవేసేందుకు సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 2వ వార్డు స్టీల్‌విల్‌పేటలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు వివరించిన సమస్యలను సావధానంగా విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె శ్రీకాంత్‌రెడ్డి ఇతర అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని సాంకేతిక సమస్యలతో పథకాలు అందుకోలేని వారికి కూడా ఈ ప్రభుత్వం పథకాలను అందజేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణ వాసులకు తాగునీటి సమస్య లేకుండా స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని తెలిపారు. మునిసిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్లు పెంటపాటి దేవి , కుడిపూడి లలిత, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నేతలు మందపల్లి చిట్టిబాబు, దొమ్మలపాటి సత్యనారాయణ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో రోడ్ల అభివృద్ధికి నిధులు




జగన్నాయకులపాలెంలో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో జగనన్న కాలనీలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం పరిశీలించారు. కాలనీలో ఇంటర్నల్ రోడ్లు సరిగా లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోవడంలో ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో అక్కడికక్కడే కాలనీలో రోడ్ల అభివృద్ధికి రూ.47 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనితో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, హౌసింగ్ డీఈ కె.మల్లికార్జునరావు, ఏఈ లంక సత్యనారాయణ, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకి సారె సమర్పణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ సాక్షి వారి వీధిలో వేంచేసిన ముత్యాలమ్మ అమ్మవారికి శుభం స్వీట్స్ యజమాని కంచర్ల చక్రధర రావు(చక్రి), వేరవేణి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలు ఆషాఢ మాసం పురస్కరించుకుని పెద్ద ఎత్తున తీపి కావడి సమర్పించారు. ముందుగా ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం నుంచి ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టుచీర తీసుకుని, స్వీట్లతో మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శాకా బాబీ, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారికి సమర్పించిన సారె

ఉపాధి పనుల్లో బాధ్యతగా మెలగాలి

సోషల్ ఆడిట్‌లో ఎంపీపీ శ్రీనివాస్



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు, చిత్రంలో ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు

మండపేట: ఉపాధి హామీ పనుల నిర్వహణలో ఫీల్డ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అవకతవకలకు ఆస్కారం లేకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ సూచించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలో జరిగిన ఉపాధి పనులపై శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోషల్ ఆడిట్ జరిగింది. కార్యక్రమాన్ని డ్వామా పీడీ మధుసూదన్‌రావు, ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీఓ ఐ.రాజు నిర్వహించారు. మండలంలో 12 గ్రామాలకు గాను రూ. 9.5 కోట్ల విలువైన 2,049 పనులు జరిగినట్టు అధికారులు తెలిపారు. 9,421 మంది కూలీలకు 2,661,39 పని దినాలు కల్పించగా సగటున రూ. 251 చెల్లింపులు జరిగాయన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఫీల్డ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల మధ్య సమన్వయ లోపంతో లబ్ధిదారులకు రూ.12 లక్షల మేర ముందస్తు చెల్లింపులు చేసినట్లు గుర్తించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 22 వేల విలువైన 90 పనిదినాలు కల్పిస్తుందన్నారు. పునాది స్థాయిలో 28 పనిదినాలు, లింటల్ స్థాయిలో 24, స్లాబ్ దశలో 28, నిర్మాణం పూర్తయ్యాక 10 పనిదినాలు చెల్లించాల్సి ఉందన్నారు. కాగా పునాది దశ పూర్తయిన ఇళ్లకు లింటల్, రూఫ్ దశ వరకు పనిదినాల సొమ్మును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినట్టు ఆడిట్‌లో గుర్తించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా పనిదినాలు చెల్లింపులు జరిగిన మేర నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని, లేనిపక్షంలో లబ్ధిదారుల నుంచి ఆ సొమ్ము రికవరీకి అధికారులు సూచించారు. గ్రామస్థాయి సామాజిక తనిఖీల్లో గుర్తించిన రికార్డుల్లో నమోదైన మేరకు క్షేత్రస్థాయిలో అక్కడక్కడ మొక్కలు లేకపోవడం, పని ప్రదేశాల్లో నోటీస్ బోర్డులు లేకపోవడం, పూర్తిస్థాయిలో ఫొటోలను ప్రదర్శించకపోవడం, పనిచేసిన మేర కూలీలకు నగదు చెల్లింపులు చేయకపోవడం తదితర లోపాలకు సంబంధించి సరిచేసేందుకు సిబ్బందికి ఆదేశాలిచ్చారు. అనంతరం డ్వామా పీడీ మధుసూధనరావు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అమృత్ సరోవర్ పథకం కింద 75 చెరువులను గుర్తించగా 60 చెరువుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో 54 లక్షల పనిదినాలకు గాను ఇప్పటి వరకూ 42.61 లక్షల పని దినాలు కల్పించి రూ. 113 కోట్ల వేతనాలు చెల్లింపులు చేశామన్నారు. రూ. 37 కోట్ల విలువైన మెటీరియల్ అందజేసినట్టు వివరించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, మట్టపర్తి గోవిందరాజులు, ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి, ఎస్ఆర్పీ నాగసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాణిక్యాంబకు ఆషాఢం సారె

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నేటి ఉదయం మాణిక్యాంబా అమ్మవారిని మొట్టమొదటి సారిగా శాకంబరి దేవిగా అలంకరించనున్నారు. అదే విధంగా అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొననున్నట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

రామచంద్రపురం రూరల్: జగన్నాయకులపాలెంలో శుక్రవారం సిగ్మా సంస్థ సూపర్‌వైజర్ తులసీ జ్యోతి, టీం సభ్యుల ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. గ్రామంలో ఎంపిక చేసిన 22 ఇళ్ల నుంచి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను నమోదు చేసుకున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో సంతానం కలిగే స్థాయిలు, శిశువుల మరణాలు, ఇతర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ఇండికేటర్లను ఈ సర్వే ద్వారా అంచనా వేయడానికి వీలు పడుతుందన్నారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ప్రశాంతి, సీహెచ్ఓ వీరవేణి, హెచ్‌వీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ, ఏఎన్ఎం శ్రీకాంతి, హెల్త్ అసిస్టెంట్ కటారపు రాంబాబు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం

రామచంద్రపురం: సంక్షేమ పథకాలు సజావుగా అమలు జరిగే విధంగా అవసరమైన ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్‌లో ఎంపికైన హెల్పర్లకు నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులోజాప్యం జరగకూడదని ఉద్దేశంతో ఆయా విభాగాల్లో ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న మూడు హెల్పర్ పోస్టులను నియమించామన్నారు. ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం పాల్గొన్నారు.

మహిళ మృతి

రామచంద్రపురం రూరల్: ఈ నెల 8న వెంకటాయపాలెంలో కారు ఢీకొని ప్రమాదానికి గురైన గుర్తు తెలియని మహిళ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ తెలిపారు. ఆమెకు సంబంధించిన బంధువులు ఎవరైనా వస్తారని ఎదురు చూసి ఎవరూ రాకపోవడంతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో శుక్రవారం ఖననం చేసినట్లు తెలిపారు.

వలంటీర్లకు వందనం

సేవే పరమావధిగా..



కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాపమ్మకు పింఛను ఇస్తున్న వలంటీర్ పెదపూడి రాజు (ఫైల్)

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వలంటీర్ వ్యవస్థ పనిచేస్తుంది. నాలుగున్నరేళ్లుగా సేవే పరమావధిగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో పరిమితంగా పింఛన్లు ఇచ్చేవారు. ఇచ్చే పింఛను సొమ్ము కూడా అతి తక్కువే. అదీ ఎన్నో వ్యయప్రయాసలు కోర్చి లబ్ధిదారులు తీసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను సొమ్ము లబ్ధిదారులకు అందుతోంది. కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామానికి చెందిన వలంటీర్ పెదపూడి రాజు సేవలను ఆయా కుటుంబాల వారు మెచ్చుకుంటున్నారు. తన పరిధిలోని లబ్ధిదారులు పింఛను ఇచ్చే సమయానికి వేరే ఊరులో ఉన్నా అక్కడకు వెళ్లి పింఛను అందిస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– కపిలేశ్వరపురం

ఎంత దూరమైనా వచ్చి..



మాది కపిలేశ్వరపురం మండలం వల్లూరు. నేను ఈ నెలలో డెంగీ జ్వరంతో కాకినాడలోని జనరల్ ఆసుపత్రిలో చేరాను. చికిత్స పొందుతున్న సమయంలో పింఛన్లు ఇచ్చారు. కాకినాడలో ఉండిపోవడంతో ఆ నెల పింఛను ఇక తీసుకోలేనని అనుకున్నాను. కానీ వలంటీర్ పెదపూడి రాజు కాకినాడ ఆసుపత్రికి వచ్చి పింఛను డబ్బులను చేతికిచ్చారు. ఇంత మంచి మనసున్న మనుషులు ఈ రోజుల్లో ఉన్నారా అనిపించింది. వలంటీర్ సేవలు ఎనలేనివి.

– వైరాల పాపమ్మ, వల్లూరు, కపిలేశ్వరపురం మండలం

సొంత డబ్బుతో..



తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో శ్రీకాంత్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కల్యాణ్ (ఫైల్)

అర్తమూరు రెండో వార్డు కాలువ గట్టు ప్రాంతానికి నాలుగేళ్లుగా చెల్లో కల్యాణ్ వలంటీర్‌గా పని చేస్తున్నారు. ఆసుపత్రిలో, వివిధ కారణాలతో నెలవారీ పింఛన్ తీసుకోని వారుంటే వారి చెంతకు సొంత ఖర్చులు పెట్టుకుని మరీ వెళతాడు. ప్రభుత్వ పింఛను అందించి వస్తుంటాడు. గ్రామానికి చెందిన శ్రీకాంత్ కిడ్నీ సంబంధిత సమస్యతో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే జనవరి, మే నెలల్లో రెండు సార్లు అక్కడకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి వచ్చాడు. మూడు సార్లు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రి, రెండు సార్లు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి, రెండు సార్లు గొల్లల మామిడాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందించాడు. ప్రభుత్వ పథకాలను తన పరిధిలోని ప్రజలకు చేరువ చేయడంలో తనదైన శైలి ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.

– మండపేట

ఆస్పత్రికి వచ్చి సాయం



అనారోగ్యంతో నేను రాజమహేంద్రవరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. పింఛన్ తీసుకోవడానికి గ్రామానికి వచ్చేందుకు లేవలేని స్థితిలో ఉన్నాను. నా వద్దకు మా వలంటీర్ కల్యాణ్ వచ్చి పింఛన్ సాయం అందజేశాడు. నాలా ఎంతో మంది వద్దకు సొంత ఖర్చులు పెట్టుకుని వెళ్లి ప్రభుత్వ సాయం అందించిన కల్యాణ్ సేవలు అభినందనీయం.

– సత్తి కుమారి, అర్తమూరు

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- టేకిలో గడప గడపకూ..



టేకిలో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని టేకి గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత త్రిమూర్తులుకు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కుక్కల బాలయ్య, పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సచివాలయ ఉద్యోగులతో కలసి ఆయన బీసీ కాలనీలో పర్యటించారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పేదల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు బలమైన వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, నాయకులు దాసి అంబేడ్కర్, నరాల సూరిబాబు, మాసాబత్తుల వెంకన్న, సూరంపూడి త్రిమూర్తులు, చింతా సూర్యనారాయణ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు విద్యుత్ సదుపాయం



గొల్లపాలెం శ్మశానవాటికలో స్తంభాలు వేసి విద్యుత్ లైన్లు వేస్తున్న సిబ్బంది

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం శ్మశానవాటికకు పంచాయతీరాజ్, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా కల్పించారు. గ్రామంలో ఎవరైనా చనిపోయి రాత్రి సమయాల్లో అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తే శ్మశానవాటికలో విద్యుత్ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వచ్చేది. దీనిపై స్థానికుల ఆందోళన మేరకూ స్పందించిన పంచాయతీరాజ్, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు సుమారు అర కిలోమీటరు మేర విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి శ్మశాన వాటికకు విద్యుత్ సదుపాయం కల్పించారు. గత వారం రోజుల నుంచి స్తంభాలు నిలబెడుతున్న సిబ్బంది శుక్రవారంతో విద్యుత్ లైన్లు వేసి లైట్లు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సారా విక్రయాలను నిరోధించాలి

కాజులూరు: మండల గ్రామాల్లో జరుగుతున్న సారా విక్రయాలను అధికారులు నిరోధించాలని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. సారా, అనధికార మద్యం విక్రయాలకు వ్యతిరేకంగా శుక్రవారం గ్రామంలో అలయన్స్ క్లబ్ సభ్యులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. భువనేశ్వరీదేవి మాట్లాడుతూ కాజులూరు మండల గ్రామాలకు ఇటు తాళ్లరేవు మండలం కోరంగి అభయారణ్యం నుంచి, అటు కరప మండలం యండమూరు నుంచి సారా సరఫరా జరుగుతుందన్నారు. గతంలో మద్యం బెల్టు షాపులు నిర్వహించే నిర్వాహకులు ప్రస్తుతం సారా విక్రయాలు చేస్తున్నారన్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్లబ్ కార్యదర్శి టీడీ దుర్గారాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి కేఎస్ఆర్ ఆంజనేయులు, కాపు చిన్నా, లొల్ల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వే పరిశీలన



చోడవరంలో భూ సర్వే వివరాలను మంత్రి వేణు, కలెక్టర్ హిమాన్షు శుక్లాలకు వివరిస్తున్న తహసీల్దార్ తేజేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణతో కలసి శుక్రవారం పరిశీలించారు. భూ సరిహద్దుల్లో పాతుతున్న సరిహద్దు రాళ్లను పరిశీలించి వివరాలను స్థానిక తహసీల్దార్ పి.తేజేశ్వరరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎ.శాంతి, ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.